క్లుప్తంగా

ఎన్‌పీఎల్ డైరెక్టర్‌ను కలిసిన వీఎస్‌యూ వీసీ



వేణుగోపాల్‌తో శ్రీనివాసరావు

వెంకటాచలం: నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ (ఎన్‌పీఎల్) డైరెక్టర్ డాక్టర్ వేణుగోపాల్‌ను విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వీసీ అల్లం శ్రీనివాసరావు సోమవారం ఢిల్లీలో కలిశారు. ఎన్‌పీఎల్‌తో వీఎస్‌యూ పరస్పర సహకార ఒప్పందంపై చర్చలు జరిపారు. వీఎస్‌యూ విద్యార్థులకు పరిశోధన అవకాశాలను విస్తరించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఆధునిక ప్రయోగశాల సౌకర్యాలను వినియోగించే అవకాశాలపై చర్చించారు.

వృద్ధాశ్రమంలో వైద్య పరీక్షలు



పొదలకూరు: పట్టణంలోని నర్సారెడ్డి కాలనీ వృద్ధాశ్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. వృద్ధులకు షుగర్, బీపీ పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జ్వరాలుంటే వెంటనే తమకు సమాచారం అందిజేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో వైద్య సహాయకులు రాధాకుమారి, శివప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ సుమాంజలి, ఆశావర్కర్లు ఉష, సీత తదితరులు పాల్గొన్నారు.

బాలల ఆశ్రమానికి బియ్యం వితరణ



కొడవలూరు: మండలంలోని టపాతోపులో విశ్వజనని అనాథ బాలల ఆశ్రమానికి కోవూరుకు చెందిన సూరిశెట్టి పవన్‌కుమార్ మూడు బస్తాల బియ్యాన్ని సోమవారం వితరణగా ఇచ్చారు. ఆశ్రమ నిర్వాహకులు బుర్లా శ్రీలక్ష్మి, ప్రేమసాగర్ పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి



బుచ్చిరెడ్డిపాళెం: సమావేశ మందిరానికి స్థలం కేటాయించాలంటూ పెన్షనర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మాల్యాద్రి, యానాదయ్యలు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. స్థలం కేటాయింపునకు తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక రిజిస్ట్రార్ ఆఫీస్ సెంటర్ వద్ద పోలీసులు వాహన తనిఖీలను సోమవారం చేపట్టారు. ప్రధానంగా ఆటోలు, బైక్‌లను తనిఖీలు చేసి పలు వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఇక నగరంలో సాయంత్రం సమయంలో బైక్‌లతో విన్యాసాలు జరిపే వారు ఈ తనిఖీల్లో పట్టుబడటం విశేషం. సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్సై సంతోష్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చక్రస్నానం



బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని రామకృష్ణ నగర్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివార్ల సుదర్శన చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని, తిలకించారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దిగజారిన ధరలు.. తగ్గిన ఎగుమతులు

- ఆకుతోటల రైతుల ఆక్రందనలు
- మండలంలో రెండుచోట్ల సాగు
- గణనీయంగా పెరిగిన పెట్టుబడులు
- తగ్గిన ధరలతో నష్టపోతున్న రైతులు

పొదలకూరు: తమలపాకు తోటల సాగు చేపట్టిన ఈ ప్రాంతంలోని కొందరు రైతులు నష్టపోతున్నారు. మార్కెట్‌లో ధరలు తగ్గిపోవడం, సాగు పెట్టుబడులు పెరగడం వంటి కారణాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దశాబ్దాలుగా మండలంలోని తాటిపర్తి, విరువూరు గ్రామాల్లో రైతులు ఆకుతోటల సాగు చేస్తున్నారు. దీనికి సంబంధించి ఈ గ్రామాలకు జిల్లాలోనే పేరుంది. అయితే క్రమంగా సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకుంటూ వచ్చారు. తెగుళ్లు, నష్టాల బారిన పడుతున్న నేపథ్యంలో సాగు చేయలేకపోతున్నారు. ఉద్యాన పంటల కిందకు వచ్చే ఆకుతోటలు ప్రతి ఏడాది అక్టోబర్‌లో తీగలను అవిసె చెట్లకు అల్లించి సాగును ప్రారంభించి జూన్, జూలై నెలల్లో ఆకులను ఎగుమతి చేస్తుంటారు. ఇందులో తెల్లాకులు (ఘాటు తక్కువగా ఉంటుంది), నల్లాకులు (ఘాటుగా ఉంటాయి) రెండు రకాలుగా పండించడం జరుగుతుంది. అయితే తాటిపర్తి, విరువూరు రైతులు తెల్లాకులనే సాగు చేస్తున్నారు. ఇవి చెన్నైకి, నల్లాకులు (కిళ్లీ ఆకులు) కోలకత్తాకు ఎగుమతి చేస్తుంటారు.



తాటిపర్తిలో సాగులో ఉన్న ఆకుతోటలు

గిట్టుబాటు కాక..

గతేడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో కురిసిన జడి, ముసురు వానలు ఆకుతోటలను పట్టి పీడించాయి. దీంతో ఆకుల దిగుబడి తగ్గడంతోపాటు రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. సాధారణంగా జనవరి నుంచి జూలై వరకు ఆకుల ధరలు బాగా ఉండాలి. అయితే ప్రస్తుతం 100 సట్టలు రూ.3 వేలు మాత్రమే ఉన్నట్టు రైతులు వెల్లడిస్తున్నారు. గిట్టుబాటు ధరలున్న సమయంలో 100 సట్టలు రూ.4 వేల నుంచి రూ.5 వేలకు వరకు పలికాయి. ఈ ప్రాంతంలో 160 తమలపాకులుంటే దాన్ని రైతులు సట్టగా పిలుస్తుంటారు. తాటిపర్తిలో 12 ఎకరాలు, విరువూరులో రెండెకరాల్లో 40 మంది రైతులు తోటలను సాగు చేస్తున్నారు. ఎకరాకు ప్రస్తుతం రూ.2.50 లక్షల వరకు పెట్టుబడులవుతున్నాయి. కాలం కలిసొస్తే ఎకరా సాగు చేసే రైతులకు రూ.6 లక్షల వరకు ఫలసాయం అందుతుంది. అయితే ఇప్పుడు పెట్టుబడులు రావడం గగనంగా ఉన్నట్టు అన్నదాతలు వెల్లడించారు.

పెట్టుబడులు వచ్చేలా లేవు



ఆకుతోటల సాగు కష్టంతో కూడిన పని. అక్టోబర్, నవంబర్‌లో సాగు చేపట్టిన మాకు పెట్టుబడులు వచ్చేలా లేవు. సాధారణంగా జనవరి నుంచి జూన్ వరకు రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తుంటాయి. ప్రస్తుతం ఆ పరిస్థితుల్లేవు. పెట్టుబడులు రావడమే గగనంగా మారింది. దశాబ్దాలుగా ఈ పంటనే నమ్ముకుని జీవిస్తున్నాం.

– ఆర్.పాపిరెడ్డి, రైతు, తాటిపర్తి

తోటలను పరిశీలిస్తాం



తాటిపర్తిలో ఆకుతోటలను పరిశీలిస్తాం. తెగుళ్లు ఉంటే రైతులకు సూచనలిస్తాం. సాధారణంగా గాలివానకు ఆకుతోటలు దెబ్బతినడం జరుగుతుంది. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటాం.

– ఈ.ఆనంద్, ఉద్యానాధికారి, పొదలకూరు

బీమా నగదు అందజేత



పత్రాలను అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

పొదలకూరు: మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాంపాటి వెంకటేష్‌కు సోమవారం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సీనియర్ మేనేజర్ పీఎస్ రాజు రూ.2 లక్షల బీమా నగదును అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ వెంకటేష్ తండ్రి రాంపాటి రోశయ్య గత సంవత్సరం మే 13వ తేదీన తన వ్యక్తిగత ఖాతా ద్వారా పాలసీ చెల్లించారన్నారు. ఆయన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడన్నారు. నామినీగా ఉన్న వెంకటేష్ దరఖాస్తు చేసుకున్న పదిరోజుల్లోనే బీమా నగదు ఇచ్చామన్నారు. పీఎం సురక్ష బీమా యోజన కింద కేవలం ఏడాదికి రూ.20 చెల్లిస్తే ప్రమాదంలో మృతిచెందిన వారికి రూ.2 లక్షలు ఇస్తారన్నారు. అకౌంటెంట్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.



ప్రసన్నను కలిసిన ఇందుకూరుపేట నాయకులు

మర్యాదపూర్వకంగా..

ఇందుకూరుపేట: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డితో కలిసి అనుబంధ విభాగాల నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి పూలమొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ట్రేడ్ యూనియన్ నేత బిరదవోలు రూప్‌కుమార్‌రెడ్డి, పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి షబ్బీర్, నాయకులు పామంజి శ్రీనివాసులు, స్వర్ణ శ్రీనివాసులురెడ్డి, పట్నం పృథ్వీకుమార్‌రెడ్డి, మోవిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

⇨ మండలంలోని వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు సోమవారం ప్రసన్నను ఆయన నివాసంలో కలిశారు. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జొన్నవాడ దేవస్థానం చైర్మన్, ఇందుకూరుపేట మండలాధ్యక్షుడు మావులూరు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సిరం నవీన్‌కుమార్ (గ్రీవెన్స్‌సెల్), ఊటుకూరు మల్లికార్జున (వలంటీర్ విభాగం), గొల్లపల్లి అవినాష్ (యువజన విభాగం), వరిగొండ శ్రావణ్(పంచాయతీరాజ్), పామంజి కల్యాణ్ (వైఎస్సార్ టీయూసీ), ఎంపీటీసీ బాలుబొమ్మ కరుణాకర్, ఇందుకూరుపేట రూరల్ బ్యాంక్ డైరెక్టర్ చిట్టిబోయిన కృష్ణప్రసాద్ తదితరులు వెళ్లి ప్రసన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల నుంచి వినతుల స్వీకరణ

పొదలకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ సురేఖ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అర్జీలను రాసేందుకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం నాలుగు అర్జీలను రైతులు అందజేశారు. వాటిని డీటీ సంబంధిత వీఆర్వోలను అందజేసి పరిశీలించాల్సిందిగా సూచించారు. ఆమె మాట్లాడుతూ వీలైనంత వరకు మండల స్థాయిలోనే సమస్యలను స్థానికంగానే పరిష్కారించాల్సిందిగా కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సాయిప్రసాద్, వెలుగు ఏపీఎం చిన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు రమేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు అర్జీలు

ముత్తుకూరు: ముత్తుకూరు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి అధికారులకు నాలుగు అర్జీలు వచ్చాయి. డీటీ ప్రదీప్, ఎంపీడీఓ నాగమణి తదితరులు వాటిని స్వీకరించారు. ఇంటి నివేశన స్థలాలు కోరుతూ వివిధ గ్రామాల కేంద్రంగా ఆటోలు నడుపుకొనే వారు వినతులిచ్చారు. అనంతరం కలెక్టర్ నిర్వహించిన సమీక్షలో పాల్గొన్నారు.

⇨ బుచ్చిరెడ్డిపాళెం: మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు వినతిపత్రాలు వచ్చినట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. అందులో మూడు సర్వేకు సంబంధించినవి కాగా ఒకటి ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం, మరొకటి కారుణ్య నియామకం కోసం వచ్చిందని తెలియజేశారు.



ముత్తుకూరు: కలెక్టర్ సమీక్షలో పాల్గొన్న డీటీ, ఎంపీడీఓ తదితరులు



పొదలకూరు: వినతులను స్వీకరిస్తున్న అధికారులు



బుచ్చిరెడ్డిపాళెం : రెవెన్యూ కార్యాలయంలో..

టీబీ కేసులను గుర్తించండి

- అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ

ఇందుకూరుపేట : గ్రామాల్లో పరీక్షలు నిర్వహించి టీబీ సంబంధిత కేసులను గుర్తించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గళ్లతో కూడిన దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉన్న ప్రతిఒక్కరికీ పరీక్షలు చేయాలని చెప్పారు. లెప్రసీ కేసులను ప్రాథమిక దశలో గుర్తించి, వైద్యం అందించడం ద్వారా త్వరగా వ్యాధి నయమవుతుందన్నారు. తొలుత రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కిశోర్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ విజయ్‌కుమార్, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ

విరువూరులో మెడికల్ క్యాంప్

పొదలకూరు: మండలంలోని విరువూరు గ్రామం ఇస్కపాళెం కాలనీలో జ్వరపీడితులు ఉన్నారనే సమాచారం తెలుసుకున్న మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు సోమవారం మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఫీవర్ సర్వే నిర్వహించి నలుగురికి సాధారణ జ్వరాలున్నట్టు గుర్తించామని వైద్యాధికారి వెల్లడించారు. జ్వరాలు అదుపులోకి వచ్చే వరకు క్యాంపును నిర్వహిస్తామన్నారు. సర్వేలో సూపర్‌వైజర్ నరసమ్మ, ఆరోగ్య సహాయకురాలు అరుణ, ఎంఎల్‌హెచ్‌పీ వెంకటయమున, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

రైతులను ఆదుకోవాలని డిమాండ్



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

మనుబోలు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని సీపీఎం నాయకుడు దేవదానం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని ఇటీవల కలెక్టర్ చెప్పారన్నారు. అయితే వరి కోతలు సమీపిస్తున్నా మండలంలో ఎక్కడా కేంద్రాల జాడ లేదన్నారు. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం ధాన్యం ధరలు ఆశాజనకంగా లేవని తెలిపారు. అలాగే ధాన్యం కొనుగోలు సమయంలో పెట్టిన నిబంధనలను సడలించాలని కోరారు. దీనికి స్పందించిన తహసీల్దార్ వరి కోతలు ప్రారంభమయ్యే లోపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, బీసీ భాస్కర్, ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 116 మంది హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ మూడో సెమిస్టర్, ఆరో సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు 116 మంది హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు తెలిపారు. 118 మందికి గానూ 116 మంది హాజరైనట్లు వెల్లడించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

బుచ్చిరెడ్డిపాళెం: సీనియర్ ఇంటర్ పరీక్షలు మండలంలో సోమవారం నుంచి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక డీఎల్‌ఎన్నార్ జూనియర్ కళాశాలలో 338 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 325 మంది హాజరైనట్లు పరీక్ష అబ్జర్వర్ కనకదుర్గ తెలిపారు. అదేవిధంగా సెయింట్ మేరీస్ డిగ్రీ కళాశాలలో 179 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలియజేశారు.

సేంద్రియ ఎరువులు ఆరోగ్యకరం



అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

కొడవలూరు: ఎలాంటి రసాయనాలు లేని సేంద్రియ ఎరువులతో కిచెన్ గార్డెన్ పెంచడం ఆరోగ్యకరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల సూచించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొడవలూరు దర్గా సంఘం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో కిచెన్ గార్డెన్ పెంచడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు ఆరోగ్యకరమైన కూరగాయలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

కండలేరులో 51.522 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 51.522 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 760, లోలెవల్ కాలువకు 110, హైలెవల్ కాలువకు 160, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నకిలీ విత్తనాలతో మునిగిపోయా

- రూ.3 లక్షల మేర నష్టం వచ్చింది
- న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి

కోవూరు: నకిలీ విత్తనాలతో తీవ్రంగా మునిగిపోయా.. ఒక గింజ ధాన్యం కూడా రాలేదు. సాగుకు రూ.3 లక్షలు అప్పు చేసి, నష్టపోయా.. నాకు న్యాయం చేయండి.. అంటూ గంగవరం గ్రామానికి చెందిన పందిళ్లపల్లి దయాకర్‌రెడ్డి కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆయన వివరాల మేరకు.. మండలంలోని ఆయనకు ఆరెకరాల పొలం ఉంది. మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని ఎనిమిది ఎకరాల్లో బీపీటీ 5204 రకం సాగు చేశారు. ఐదు నెలల పంట కాలపరిమితి. ఇప్పటికే నాలుగు నెలలు దాటినా కనీసం వెన్ను తీయలేదు. దీంతో విత్తనాలను అమ్మిన నగరంలోని వర్షిత సీడ్స్ యజమానిని సంప్రదించారు. వారు చెప్పిన అన్ని రకాల మందులను వాడారు. అయినా ఫలితం లేకపోవడంతో వ్యవసాయాధికారులు సూచనలు మేరకు మందులు వాడారు. చివరకు పంట పండదని అధికారులు చెప్పడంతో దున్నించేశారు. ఈ విషయంపై కోవూరు ఏఓ ఇందిరావతిని వివరణ కోరగా రైతు మోతాదుకు మించి పురుగు మందులను పిచికారీ చేశారన్నారు. కాగా ఆ పొలాన్ని నెల్లూరు నుంచి పలువురు శాస్త్రవేత్తలు వచ్చి పరిశీలించారు.



పొలంలో దిగాలుగా ఉన్న రైతు దయాకర్‌రెడ్డి

పలువురికి ప్రసన్న పరామర్శ



కోవూరులో..



బుచ్చిరెడ్డిపాళెంలో..

కోవూరు: విడవలూరు మండలం, దండిగుంట సర్పంచ్ బెల్లంకొండ సుప్రజ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కోవూరులో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆమెను మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆమె భర్త బెల్లంకొండ శ్రీధర్‌కు ధైర్యంగా ఉండాలని చెప్పారు. పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, విడవలూరు మండలాధ్యక్షులు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, కోవూరు మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు సుధీర్‌కుమార్ రెడ్డి, వాకా సుబ్బరామిరెడ్డి, సిద్దవరపు కిశోర్‌రెడ్డి, తలపల వేణు, రమేష్, జెట్టి శ్రీను పాల్గొన్నారు.

⇨ బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడ దేవస్థానం వంశ పారంపర్య అర్చకుడు చిక్కుడు ప్రసాద్ మాతృమూర్తి భవనమ్మ కుటుంబాన్ని సోమవారం ప్రసన్న పరామర్శించారు. పార్టీ నేతలు మురళి, నాటారు బాలకృష్ణ, బుచ్చి మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి, ముంగర శివకుమార్, కందికట్టు చిన్న రమణయ్య, ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, రాజేష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ముత్తుకూరు: మండలంలోని ముత్తుకూరులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై విశ్వనాథరెడ్డి సోమవారం వివరాలు వెల్లడించారు. బోడిస్వామి కండ్రిగకు చెందిన పోకపూడి ఏడుకొండలు (28) రొయ్యల మేత కోసం మోటార్‌బైక్‌పై ముత్తుకూరుకు వెళ్లాడు. తిరిగి ఊరికి వస్తుండగా బీసీ కాలనీలో ఏడుకొండలు ఆటోను ఓవర్‌టేక్ చేశాడు. అయితే ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం అతడి బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



ఏడుకొండలు మృతదేహం